క్లుప్తంగా

ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం

ఆసిఫాబాద్అర్బన్: హనుమాన్ జయంతి పురస్కరించుకొని గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో శుక్రవారం స్వాములు సామూహిక అఖండ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ సంకల్ప పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి వెంకన్న, కోశాధికారి పిన్నా వివేక్, సభ్యులు రాధాకృష్ణచారి, రాజు, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్ర జయప్రదం చేయండి

ఆసిఫాబాద్అర్బన్: హనుమాన్ జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించే శోభాయాత్రను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, వెంకన్న, వివేక్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శోభాయాత్రలో హనుమాన్ దీక్షాస్వాములు, భక్తులు, ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. శోభాయాత్ర స్థానిక సాయిబాబా ఆలయం నుంచి ఉదయం 7 గంటలకు ప్రారంభమై పట్టణ ప్రధాన వీధుల గుండా కొనసాగుతుందని తెలిపారు.

శనిమందిర్‌లో హనుమాన్ జయంతి వేడుకలు

కాగజ్‌నగర్‌రూరల్: ఈనెల 23న పట్టణంలోని పోచమ్మ బస్తీలో గల శనిమందిర్‌లో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ పండిత్ నందకిశోర్ జోషి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

'రైస్‌మిల్లర్లపై ఆరోపణలు సరికాదు'

కాగజ్‌నగర్‌రూరల్: జిల్లాలోని రైస్‌మిల్లులపై ఆరోపణలు చేయడం సరికాదని జిల్లా రైస్ మిల్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కాసం శ్రీనివాస్, కోశాధికారి గర్రెపల్లి గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే హరీశ్ బాబు, కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్‌లు చేసుకుంటున్న ఆరోపణల నేపథ్యంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నిత్యాన్నదాన సత్రం నిర్వహణకు రైస్‌మిల్లు యజమానులను బియ్యం అడగలేదని, తాము ఇవ్వలేదని పేర్కొన్నారు. జిల్లాను బియ్యం కొరత ఉన్న జిల్లాగా గుర్తించి సీఎస్‌పీకి పర్మిషన్ ఇవ్వడం జరిగిందన్నారు. మిల్లర్లు వందశాతం బియ్యాన్ని ప్రభుత్వానికి అందించినట్లు పేర్కొన్నారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలు

జైనూర్: నీటి ఎద్దడిని నివారించేందుకు జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశాల మేరకు మండల యంత్రాంగం కృషి చేస్తుందని ఎంపీడీవో ప్రభుదయ అన్నారు.

బీజేపీలో చేరికలు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీకి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం జెడ్పీటీసీల జిల్లా ఫోరం అధ్యక్షుడు నాగేశ్వర్‌రావ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ఎంపీపీ మల్లిఖార్జున్‌ల ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు.

'బీజేపీ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలి'

ఆసిఫాబాద్: దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడపగడపకూ తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోకసభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినందున రాబోయే 29 రోజుల్లో పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, పార్టీ నాయకులు కొట్నాక విజయ్‌కుమార్, చెర్ల మురళీధర్, చక్రపాణి, కిరణ్‌కుమార్, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఉపాధి పని చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో భిక్షపతిగౌడ్

కెరమెరి: జాబ్ కార్డు కలిగిన కూలీలు ప్రతీరోజు ఉపాధి పనులకు వెళ్లాలని డీపీవో భిక్షపతిగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సావర్‌ఖెడా గ్రామంలో గుట్టపై కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం కూలీని రూ.300లకు పెంచిందని, ఎండల తీవ్రత ఉన్న కారణంగా ఉదయం పనులు చేయాలన్నారు. అనంతరం ఝురి గ్రామ పంచాయతీని సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ మోతీరాం, ఎంపీడీవో కృష్ణారావు, ఎంపీవో అంజద్‌పాషా, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, మాజీ సర్పంచ్ న్యానేశ్వర్ తదితరులు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించరూ..!

- ఆర్టీసీ బస్సులు లేక మహారాష్ట్రకు వెళ్లే ప్రయాణికుల తిప్పలు
- ప్రైవేట్ వాహనాలే దిక్కు
- రాజూరా డిపో బస్సు నడిపిస్తున్న మహారాష్ట్ర అధికారులు
- తెలంగాణ ఆర్టీసీ బస్సులు నడపాలని ప్రజల వేడుకోలు





వెంకట్రావ్‌పేట్ -పోడ్సా అంతర్రాష్ట్ర రోడ్డు

సిర్పూర్(టి): మండల కేంద్రం నుంచి మహారాష్ట్రకు బస్సు సౌకర్యం కల్పించాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలతో పాటు నియోజకవర్గంలోని కౌటాల, బెజ్జూర్, కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్, దహెగాం, చింతలమానెపల్లి మండలాల ప్రజలు కోరుతున్నారు. సిర్పూర్(టి) మండలం సరిహద్దుగా మహారాష్ట్రలోని వీరూర్, రాజూరా, బల్లార్షా, చంద్రపూర్, గోండ్‌పిప్రి, అహెరి పట్టణాలకు ప్రధాన రహదారులు ఉన్నాయి. అయితే బస్సు సౌకర్యం లేకపోవడంతో ఈ రోడ్డు గుండా ప్రతీరోజు ప్రయాణాలు చేసే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం..

మండలానికి ఆనుకొని ఉన్న మహారాష్ట్ర గ్రామాలతో పాటు ఆయా పట్టణాలకు వివిధ పనుల కోసం ప్రతీరోజు నియోజకవర్గ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాల ద్వారా అధిక చార్జీలు వెచ్చించి ప్రయాణాలు సాగించాల్సి వస్తుంది. దీంతో ప్రయాణ భారంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు మహారాష్ట్ర గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్రలోని రాజూరా పట్టణానికి చెందిన డిపో బస్సు పది రోజుల క్రితం నుంచి రోజూ ఉదయం సిర్పూర్(టి) -మాకిడి అంతర్రాష్ట్ర రహదారి గుండా రాజూరా పట్టణానికి కొనసాగిస్తున్నారు. అయితే మిగతా సమయాల్లో బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు నడుపుతుండగా ఆసిఫాబాద్ డిపో ఆర్టీసీ అధికారులు మాత్రం బస్సు సౌకర్యం కల్పించకపోవడం ఏంటని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకట్రావ్‌పేట్ -పోడ్సా అంతర్రాష్ట్ర రహదారి గుండా గోండ్‌పిప్రి, అహెరీ, గడ్చిరోలీ జిల్లాలకు బస్సు సౌకర్యం లేక ప్రతీరోజు ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఈ రహదారి గుండా బస్సు సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

హామీలు.. నీటి మూటలు..

సిర్పూర్(టి) మండలకేంద్రం నుంచి మహారాష్ట్ర పట్టణాలు రాజూరా, బల్లార్షా, చంద్రపూర్, గోండ్‌పిప్రిలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో అధికారులు పలు దఫాలు సర్వేలు నిర్వహించి హామీలు ఇచ్చినప్పటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం మాత్రం కల్పించలేదు. మండలకేంద్రం మీదుగా మహారాష్ట్ర గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీలు ఇవ్వడమే తప్పా ఇప్పటివరకు బస్సు సౌకర్యం కల్పించలేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి సిర్పూర్(టి) నుంచి మహారాష్ట్ర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ఆర్థికంగా ఇబ్బందులు



మండల కేంద్రం మీదుగా సరిహద్దున ఉన్న మహారాష్ట్ర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు నిరుపేద ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసిఫాబాద్ ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి.

\- కిర్మరే శ్యామ్‌రావ్, సిర్పూర్ (టి)

బస్సు సౌకర్యం కల్పించాలి



మండలకేంద్రం నుంచి మహారాష్ట్ర పట్టణాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని అధికారులు పలు దఫాలు సర్వేలు చేశారు. కానీ ఇప్పటికీ బస్సు సౌకర్యం కల్పించలేదు. ఆర్టీసీ అధికారులు వెంటే బస్సు సౌకర్యం కల్పించాలి.

\- ఎర్ర మల్లేశ్, సిర్పూర్ (టి)

వేసవి దుక్కులు మేలు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

- తప్పనున్న చీడపీడల బెడద
- పంటలో అధిక దిగుబడి
- సకాలంలో విత్తనాలు వేసే అవకాశం

లింగాపూర్: పంటకోతలు పూర్తయ్యాక వేసవికాలంలో భూములు ఎలాంటి సాగు లేకుండా ఉంటాయి. ఈ సమయంలోనే భూసారం పెరిగేలా సరైనా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు పేర్కొంటున్నారు. వేసవికాలంలో దుక్కులు దున్నడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని లింగాపూర్ వ్యవసాయ విస్తరణ అధికారి అమూల్య పేర్కొంటున్నారు.

రైతులకు ప్రయోజనం..

సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నీటి వసతి ఉన్న భూములు తప్పా వర్షాధారంగా పంటలు పండించే భూములు వేసవిలో ఖాళీగా ఉంటాయి. తొలకరి వర్షాలు కురిసే నాటికి భూమిని లోతుగా దున్ని దుక్కులు చేసుకోవడంతో రైతులకు ప్రయోజనం కలుగుతుంది. దుక్కులు చేయడంతో భూమిపై పొరలు లోపలికి, లోపలి పొరలు భూ ఉపరితలానికి చేరుతాయి. దీంతో పంట దిగుబడి పెరుగుతుంది. వానాకాలంలో పంటలో తెగుళ్లు, కలుపు మొక్కల నివారణకు ఉపయోగకరంగా ఉంటుంది.

అధిక దిగుబడికి మార్గం

వేసవికాలం దుక్కులు చేసుకోవడానికి సరిపడా తేమ ఉన్న చేనులో ట్రాక్టర్లు, ఎద్దుల నాగళ్లతో లోతుగా దుక్కులు దున్నాలి. సుమారు తొమ్మిది అంగుళాలకు తగ్గకుండా దుక్కులు దున్నుకోవాలి. లోతు దుక్కులు దున్నడం వల్ల నేలపై పొరల్లో ఉండే పురుగులు, తెగుళ్లను ఆశించే పురుగులు నశిస్తాయి. నేలలో దాక్కునే క్రిమికీటకాలు ఎండల బారిన పడి చనిపోతాయి. దీంతో పంట సమయంలో పంటపై క్రిమికీటకాల ప్రభావం తక్కువ ఉండటంతో అధిక దిగుబడి వస్తుంది. దీంతో పాటు పంట పొలంలో కలుపు నివారించుకోవచ్చు. పొలంలో ఎక్కువగా తుంగా, గరిక, ఒలిపిడి వంటి కలుపు మొక్కల వేర్లు, కాయలు పెకిలిపోయి బయటకు వచ్చి ఎండకు మాడిపోతాయి. ఎండిపోయిన వేర్లు, కాయలు, దుంపలను ఏరి వేస్తే మంచి ఫలితం ఉంటుంది. లోతు దుక్కులు చేసుకుంటే తొలకరి వర్షంలోనే విత్తనాలు విత్తుకునే అవకాశం ఉంటుంది. తద్వారా పంటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

మందలతో లాభం..

గతంలో రైతులు ఎద్దులు, ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలను రాత్రి సమయంలో పొలాల్లో మందలు పెట్టేవారు. పశువుల మలమూత్రాలు పొలంలో సేంద్రియ ఎరువుగా మారి పంటలకు ఉపయోగకరంగా ఉండేది. దీంతో రైతులకు ఎరువు ఖర్చు తక్కువగా ఉండేది. ప్రస్తుతం పశువులు తగ్గిపోవడంతో పంటలకు సేంద్రియ ఎరువు వాడకం తగ్గిపోతోంది. ప్రస్తుతం రైతులు వేసవికాలంలో పంట చేలు, పొలాల్లో గొర్రెల మందను పది రోజుల పాటు ఏర్పాటు చేసుకుంటే మంచి సేంద్రియ ఎరువు లభిస్తుంది.

అవగాహన కల్పించాలి



వేసవి దుక్కులతో కలిగే ప్రయోజనాలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాలి. గ్రామసభలు నిర్వహించి సాగులో తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు రైతులకు తెలియజేయాలి. సాగులో మెలకువలపై అవగాహన లేక రైతులు నష్టపోతున్నారు.

\- చాటే పాండురంగ్, వంజారిగూడ

ఎన్నో ప్రయోజనాలు

వేసవి దుక్కులతో వర్షాకాలంలో మంచి ఫలితాలు వస్తాయి. లోతుగా దుక్కులు దున్నుకునేందుకు ఆసక్తి చూపాలి. దీంతో పొలంలో ఉన్న చీడపీడలు నశించి పంట దిగుబడి పెరుగుతుంది. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

\- అమూల్య, వ్యవసాయ విస్తరణ అధికారి, లింగాపూర్

'ఆరోపణలు చేయడం మానుకోవాలి'



దహెగాం: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



పెంచికల్‌పేట్: ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దహెగాం: కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కోనప్పలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు నిరాధారణమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెమ్మకారి తోగయ్య అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే హరీశ్‌బాబుపై ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. హరీశ్‌బాబు ఆరోపణలు రుజువు చేయలేని పక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మండల ఇన్‌చార్జి వెంకటేశ్, నాయకులు శ్రీను, రాజు, రవి, సురేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌లపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే ఆరోపించడం సిగ్గు చేటని విమర్శించారు. అంతకు ముందు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు బండు, నాయకులు తిరుపతి, శ్రీనివాస్, రాజన్న, సాజీద్, జాజిమొగ్గ శ్రీనివాస్, సంజీవ్, బాబు, బండన్న, భాస్కర్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబపై కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బెజ్జూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ హరీశ్‌బాబు రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, సీతక్కలపై నిరాధార ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, మండల అధ్యక్షుడు ఖూస శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు అబ్దుల్ హకీమ్, బెజ్జూర్ మాజీ ఉపసర్పంచ్ బాపూరావు, కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు ఆత్రం రాజారామ్, నాయకులు జావిద్, నరేందర్ గౌడ్, మహేశ్, రాము, వినోద్, శంకర్, గంగారాం, శంకర్, వెంకటేష్, సాయి పాల్గొన్నారు.

కౌటాల: ఆదివాసీ బిడ్డ మహిళ మంత్రి సీతక్కపై అసత్యపు ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు కుమురం మాంతయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మన్నెవార్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మెర్పల్లి బ్రహ్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోశం, సదాశివ్, మధుకర్, వసంత్‌రావు, చింటు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

రాష్ట్ర మంత్రి సీతక్క, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పపై అసత్యపు ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం కౌటాల పోలీస్ స్టేషన్‌లో కౌటాల కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. నాయకులు దేవన్న, శ్రీనివాస్, శ్రీరాములు, సంతోష్ పాల్గొన్నారు.

'ఆశ కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవాలి'

కాగజ్‌నగర్‌రూరల్: ఆశ వర్కర్ అఫ్సానా భాను కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ డిమాండ్ చేశారు. పట్టణంలోని చారిగాం రోడ్డుకు చెందిన ఆశా వర్కర్ అఫ్సానా భాను సరైన వైద్యం అందక మృతి చెందారని, ఆశా వర్కర్లతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వం కనీస ఖర్చులు కూడా ఇవ్వలేదన్నారు. అఫ్సానా భాను భర్త షేక్ అశ్రఫ్ ఆమె చికిత్స కోసం ఎండలో తిరిగి తీవ్ర అస్వస్థతకు గురై పరిస్థితి విషమించి మృతి చెందాడన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే సరైన వైద్యం అందకపోవడం వల్లనే భార్యభర్తలిద్దరు ప్రాణాలు కోల్పోయారని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఆనంద్‌రావు

కెరమెరి: మిషన్ భగీరథలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి కూటికల ఆనంద్‌రావు అన్నారు. శుక్రవారం కెస్లాగూడ వాటర్‌గ్రిడ్‌లో కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్న యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బుద్దయ్య, చరణ్, శ్రీనివాస్, సిద్దు, రవి, ప్రకాశ్, శంకర్, కిరన్, సునీల్, విజేశ్, నితీశ్, అంకుష్ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని కొటగూడలో అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మణ్, సురేశ్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక



వాంకిడి: అర్హత సాధించిన విద్యార్థులు



ఆత్రం లక్ష్మీప్రసన్న



ఎర్గటి అభిత

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో గల నాగ్‌సేన్ బుద్ధ విహార్‌లో కోచింగ్ తీసుకున్న 10 మంది విద్యార్థులు ఇటీవల వెలువడిన గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. ఖమాన గ్రామానికి చెందిన జాడి శాంతిలాల్, గోగుల సాయిలు ఒక నెల రోజుల పాటు సాయంత్రం బుద్ధ విహార్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో 10 మంది పిల్లలకు కోచింగ్ ఇచ్చారు. కోచింగ్ తీసుకున్న 10 మంది కూడా అర్హత సాధించడంతో పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెబ్బెన: ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన 5వ తరగతి గురుకుల పాఠశాలల ప్రవేశాల ఫలితాల్లో మండలంలోని లేతన్‌గూడ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు దొడ్డిపట్ల రవికుమార్ తెలిపారు. పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరు కాగా వారిలో ఆత్రం లక్ష్మీప్రసన్న, ఎర్గటి అభితలు ఎంపికైనట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు చెందిన ఇద్దరు గిరిజన విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపిక కావడం హర్షనీయమన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

దహెగాం: సార్వత్రిక ఎన్నికల్లో ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కోనప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌తో కలిసి కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను తీసుకొచ్చిందన్నారు. ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రామారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోగయ్య, నాయకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త క్షేత్రస్థాయిలో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతీ గడపకు కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలను తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

'భూ ఆక్రమణదారులు ఎమ్మెల్యేపై మాట్లాడటం విడ్డూరం'

బెజ్జూర్: భూ అక్రమాలు చేసిన కొందరు కాంగ్రెస్ నాయకులు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ అన్నారు. మండలంలోని సలుగుపల్లి (ఊట్‌సారంగాపల్లి)లో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమాలు, అన్యాయాలు చేసిన అవినీతిపరులు కాంగ్రెస్‌లో చేరి సిర్పూర్ ఎమ్మెల్యే తప్పు చేసినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు సామల తిరుపతి, దిగంబర్, వసీఉల్లా ఖాన్, రాకేశ్, నారాయణ, రామయ్య, లింగయ్య, బిక్షపతి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమ్మెర బాలకృష్ణ

భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా చర్యలు

కాగజ్‌నగర్‌రూరల్: భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించనున్న హనుమాన్ జయంతి ర్యాలీ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్‌సుల్తానా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్ భజరంగ్ దళ్ సభ్యులతో ఏర్పాట్ల గురించి చర్చించారు. హనుమాన్ మందిరం వద్దకు వచ్చే భక్తులకు శానిటేషన్, తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రాజేందర్, కౌన్సిలర్లు శివ, జయచందర్, రాము, వసీం, భజరంగ్ దళ్ సభ్యులు శివాగౌడ్, లెక్కల మురళీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్

ప్రమాదకరంగా తరలింపు

కౌటాల: కౌటాల -బెజ్జూర్ ప్రధానరహదారిపై విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్ వెనుక భాగంలో కట్టి శుక్రవారం ప్రమాదకరంగా తరలించారు. తలోడి శివారులో ఉన్న విద్యుత్ స్తంభాలను సదరు గుత్తేదారు గురుడుపేట శివారులోకి రోడ్డుపై ఈడ్చుకుంటూ తరలించారు. దీంతో ప్రధాన రహదారి తీవ్రంగా ధ్వంసమవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ప్రమాదకరంగా తరలిస్తున్న కరెంట్ స్తంభాలు